



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 597 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 27 గురువారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం


# కోనసీమ కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- 45 రోజుల్లో సమస్యల శాశ్వత పరిష్కార మార్గాల అన్వేషణ
- సంక్రాంతి తర్వాత యాక్షన్ ప్లాన్
- కొబ్బరి చెట్టుని నమ్ముకున్న వాళ్లు రోడ్డున పడకూడదు
- కొబ్బరి రైతు సమస్యలతో రోడ్డెక్క కూడదు
- కోనసీమ కొబ్బరి రైతుకి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది
- రాజోలు నియోజకవర్గం, శంకరగుప్తం డ్రెయిన్ బాధిత కొబ్బరి రైతులతో ముఖాముఖిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

2



## కొబ్బరి తోటల్లో పవన్..అరటి తోటలో జగన్.

# రైతుకు మేలు జరిగేనా..?

విజయవాడ, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 26 : ఏపీలో ఇద్దరు ముఖ్య నేతలు బుధవారం పొలం బాట పట్టారు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు అధికార, విపక్ష నాయకులు వేరువేరుగా అన్నదాతలతో సమావేశం అయ్యారు. శంకరగుప్తంలో సముద్రపు నీరు చేరి పాడవుతున్న కొబ్బరితోటలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పరిశీలించారు. కొబ్బరితోటల సమస్యల గురించి అవి దెబ్బతింటున్న పరిస్థితుల గురించి స్థానికులతో, రైతులతో, సంబంధిత అధికారాలతో మాట్లాడారు. అదేవిధంగా పులివెందుల నియోజకవర్గం బ్రాహ్మణపల్లెలో అరటి తోటలను మాజీ సీఎం జగన్ మోహన్



2

రెడ్డి పరిశీలించారు. అరటికి మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న రైతులతో జగన్ ముఖాముఖి నిర్వహించారు. తానేదో ఇప్పుడు తాత్కాలిక పరిష్కారంగా ఒక 20 కోట్లు ఇచ్చేసి, మీతో చప్పట్లు కొట్టించుకుని వెళ్ళిపోవడానికి చూడట్లేదు.



# విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణ రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేసింది. నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలో నివాసాల మధ్య కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. మద్యం దుకాణాల నియంత్రణపై తమకు పూర్తి అధికారాలు లేనప్పటికీ, ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే వరకు తాము ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కనీసం రహదారిపైకి మద్యం దుకాణాలు కనిపించకుండా ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను కూడా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరణ ఇవ్వాలని నాగారం మున్సిపల్, ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు సదరు మద్యం దుకాణం యజమానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.






# వాడివేడిగా మాక్ అసెంబ్లీ..

## వారిని మార్షల్స్ ఎత్తి బైటేశారు!

అమరావతి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 26 :
రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతి శాసనసభా ప్రాంగణంలో స్టూడెంట్స్ మాక్ అసెంబ్లీ నిర్వహించారు.

2



# మన ప్రభుత్వం వచ్చిపోయింది కదన్నా !

పులివెందుల, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 26 : జగన్ రెడ్డి తన ట్రేడ్ మార్క్ హామీని పులివెందుల ప్రజలకు ఇస్తున్నారు. చాలా కాలం తర్వాత మూడు రోజుల పర్యటనకు వచ్చిన ఆయన ప్రజాదర్బార్ పేరుతో ప్రజలకు కొంత సమయం కేటాయించారు. వచ్చిన వారంతా తమ సమస్యలను ఏకరవు పెట్టారు. అందరికీ ఒకటే సమాధానం చెప్పారు జగన్ రెడ్డి. త్వరలో మన ప్రభుత్వం వస్తుంది.. అప్పుడు అన్ని సమస్యలూ తీరిపోతాయని చెప్పుకొచ్చారు. అదే హామీతో అందరూ తిరిగి వెళ్లారు. కానీ ఎవరికైనా వ్యక్తిగతంగా అయినా కాస్త సాయం చేసేందుకు ముందుగు రాలేదు.

**- వినతి పత్రాలు తీసుకోవడానికి దర్బార్ ఎందుకు?**

సీఎంగా ఓడిపోయాక.. రెండు, మూడు సార్లు పులివెందులలో ప్రజాదర్బార్ పెట్టారు. ఎప్పుడు ఇలా పెట్టినా పార్టీ నేతలంతా పెద్ద ఎత్తున తరలి వచ్చి తమకు బిల్లులు రావాల్సి ఉన్నాయని, బెట్టింగుల్లో డబ్బులు పోగొట్టుకున్నామని సాయం చేయాలని కోరేవారు. అయితే జగన్ వారికి ఇప్పుడు మన దగ్గర అధికారం లేదు కాబట్టి కోర్టుకు వెళ్లి



అయినా బిల్లులు ఇప్పిస్తామని చెప్పేవారు. తర్వాత ప్రజాదర్బార్ చాలా కాలం ఆపేశారు. ఇటీవల జడ్పీటీసీ ఉపఎన్నికల్లో ఘోరమైన ఫలితాలు రావడంతో ఇప్పుడు మనసు మార్చుకున్నారు. మళ్లీ ప్రజాదర్బార్ నిర్వహించేందుకు మొగ్గు చూపారు.

**- ఎన్నికలకు ముందు భారీగా డబ్బుల పంపిణీ**

గత ఎన్నికలకు ముందు వైసీపీ క్యాడర్ కు స్థాయిని బట్టి డబ్బులు పంపిణీ చేశారు. మండల స్థాయి నేతకు పది లక్షల వరకూ ఇచ్చారు. అడగకపోయినా ఇవ్వడంతో వారంతా ఖుషీ అయ్యారు. కానీ బెట్టింగుల్లో ఎక్కువగా పోయాయి. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండటంతో పనులు కావడం లేదు. దీంతో ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నారు. క్యాడర్ అంతా ఎంతో కొంత జగన్ సాయం చేస్తారని ఆశతో వస్తున్నారు. అయితే ఇప్పుడు జగన్ రూపాయి కూడా ఇవ్వడం లేదు. మన ప్రభుత్వం వచ్చాక మంచి రోజులు వస్తాయని చెప్పి వారిని సంతోషపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు.

**- పార్టీ కార్యకర్తలకు ఇప్పుడు ఎంతో కొంత సాయంచేయవచ్చుగా !**

అనారోగ్యం సమస్యతో చికిత్స చేయించుకోవడానికి సాయం కోసం వచ్చినా జగన్ ట్రేడ్ మార్క్ సమాధానమే ఆయన వద్ద నుంచి వస్తోంది. పార్టీ నేతలు కూడా తాము సాయం చేస్తాం అని మీరు మాత్రం హామీ ఇవ్వండి చాలు అని జగన్ తో చెప్పించినా వాళ్లు సంతోషరడతారు. కానీ అలాంటి హామీ కూడా ఇవ్వరు. అరటి రైతులకు నష్టాలొస్తున్నాయని వారిని పరామర్శించేందుకు జగన్ వెళ్తున్నారు. వారికేమైనా సాయం చేస్తారేమో చూడాల్సి ఉంది !

# కొబ్బరి తోటల్లో పవన్..అరటి తోటల్లో జగన్..రైతుకు మేలు జరిగేనా..?

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలి అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖాముఖిలో ఆయన రైతులతో చర్చించారు. మొత్తం కోనసీమ జిల్లాలో కొబ్బరి రైతాంగానికి సంబంధించి శాశ్వత పరిష్కారం వెతికే దిశలో ఇది మొదటి సమావేశమే అన్నారు. మీరు ఇంత కష్టపడేది మీ బిడ్డలకోసమే, ఇక్కడున్న రైతుల బిడ్డలు ఒక్కొక్కళ్ళు 20 ఏళ్ల వయస్కులే ఉండి ఉండొచ్చు. వారికి మంచి భవిష్యత్తు అందించడం కోసం మీరు పడే తపనే నేను పడుతున్నాను అని పవన్ అన్నారు. మీ ఆదాయమార్గం, మీ వృత్తి పరంగా ఎలాంటి సమస్యలు అవరోధాలు ఉన్నాయో అవి పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నా అని హామీ ఇచ్చారు. అదే విధంగా బ్రాహ్మణపల్లిలో అరటి రైతులతో సమావేశమైన అనంతరం వైఎస్ జగన్ మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో అరటి రైతుల కోసం రైళ్లు నడిపాం అని తెలిపారు. అనంతపురం - ఢిల్లీ, తాడిపత్రి-ముంబై రైళ్లు నడిపాం. తమ హయాంలో 3 లక్షల టన్నులు ఎక్స్ పోర్ట్ చేశామన్నారు. అరటి పంటపై కేంద్ర నుంచి అవార్డులు తీసుకున్నాం. ఇప్పుడు అరటి ఎక్స్ పోర్ట్ అనేదే జరగడం లేదు అని ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వంలో రైతు అంటే ప్రేమ లేదని, తమ ప్రభుత్వ హయాంలో టన్ను రూ.30వేలకు పైగా పలికిందని, ఇప్పుడు రూ.2వేలకు కూడా కొనేవాడు లేడు అని జగన్ ఆరోపించారు. మొత్తం మీద ఇరు పార్టీలకు చెందిన ముఖ్య నేతలు పొలాల్లో పర్యటించడం బుధవారం ప్రాధాన్యత సంతరించుకుంది.

# నాటి "నిరవద్యపురమే" నేటి నిడదవోలు

సాకీ

సువర్ణాక్షర లిఖితమైన పురమా ! చరిత్ర సృష్టించిన స్థలమా !
ఓ నిరవద్య పురమా !
తూర్పు చాళుక్య రాజధానివై వెలుగొందినావా !
మరపు రాని, మరువ లేని కీర్తి కిరీటమైనావా !

\- పల్లవి

నమో నిరవద్యపురమా !
అందుకొనుమా మా వందనములు !! దీవింపుమా మమ్ము
నీ దివ్య కరుణామృత కరముల చేత

\- చరణం 1

తూర్పు చాళుక్యుల రాజధానివై వెలుగొందిన నిరవద్య
పురమా !
జల దుర్గమై, శత్రు దుర్భేద్యమై వెలుగొందినావా !
కాకతీయుల వియ్యముతో వర్ధిల్లినావా !
శిల్ప కళకు పేరు గాంచి పరిఢవిల్లినావా !
"నమో"

\- చరణం 2

చాళుక్యుల మకర ధ్వజ వీర విహారమై
శత్రు వినాశన పాప పరిహారమై ప్రభవించె
నూరు నెనిమిది శివాలయాలు
అజరామర కీర్తినొందె చాళుక్య రాజు నిరవద్యుడై
"నమో"

\- చరణం 3

కాకతీయ గణపతి దేవుని ముద్దుల పట్టివై ఎదిగిన
చాళుక్య వీరభద్ర రాజు కళత్రమై ఒదిగిన
రాణీ రుద్రమ దేవి ఏలిన భూమిరా ఈ పురము
నాటి మేటి మన నిరవద్య పురము
నేడు వెలుగొందుచున్నది నిడదవోలు పట్టణమై
"నమో"

\- చరణం4

అరువది వత్సరముల అభివృద్ధితో వర్ధిల్లుచున్నది
నిరవజ్జప్రోలను మన నిరవద్య పురము
వజ్రోత్సవ వేడుకలతో తళ తళా వెలుగొందుచున్నదీ
నరేంద్రమోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దీవెనలతో
మన జన నాయకుడు దుర్గేష్ రథ సారథ్యంలో
శుక్ల పక్ష చంద్ర బింబమై తేజస్సు వెదజల్లు నాటి మన
నిరవజ్జప్రోలు ! నేటి మన నిడదవోలు !!
"నమో"

**- కోట రామ ప్రసాద్**
**గేయ రచయిత**



## రాజ్యాంగ విలువలను పెంపొందించేందుకు

# ప్రతి ఏటా 'రాజ్యాంగ దినోత్సవం!

మామడ :భారత రాజ్యాంగాన్ని స్వీకరించినందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం నవంబర్ 26 న మన దేశంలో 'సంవిధాన్ దివస్' అని కూడా పిలువబడే రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భం గా ఎంపీడీఓ సుశీల్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం దేశంలోని పౌరులకు హక్కులు కల్పించిందన్నారు.ఆయన వివరిస్తూ1949 నవంబర్ 26 న భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది, ఇది 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది.

కార్యక్రమంలో ఎంపివో హరిక్రిష్ణ, ఏపీవో శివాజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణకు సన్మానం




నిజామాబాద్ ప్రతినిధి :
నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన బొబ్బిలి రామకృష్ణకు యువకులు ఘనంగా సన్మానించారు. నగరంలోని ఎల్లమ్మగుట్టలోని బొబ్బిలివీధికి చెందిన యువకుడు బొబ్బిలి వినేష్ (బిట్టు) ఆధ్వర్యంలో ఇటీవల నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించిన బొబ్బిలి రామకృష్ణకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి అఖిలేష్, బొబ్బిలి మహేష్, గట్టుకోల్ సంతోష్, ఆకుల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# వాడివేడిగా మాక్ అసెంబ్లీ..

ఈ మాక్ అసెంబ్లీకి సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు హాజరయ్యారు. మాక్ అసెంబ్లీలో మాక్ సీఎంగా మన్యం జిల్లాకు చెందిన ఎం.లీలాగౌతమ్, ప్రతిపక్ష నేతగా అదే జిల్లాకు చెందిన సౌమ్య వ్యవహరించారు. డిప్యూటీ సీఎంగా విశాఖ జిల్లాకు చెందిన కోడి యోగి, విద్యాశాఖ మంత్రిగా తిరుపతి జిల్లాకు చెందిన చిన్మయి, అసెంబ్లీ స్పీకర్ గా కాకినాడ జిల్లాకు చెందిన స్వాతి ఉన్నారు. అసెంబ్లీలో పలు బిల్లులు ప్రవేశపెట్టి వాటిపై స్వల్పకాలిక చర్చ చేపట్టారు. 45 వేల పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారం చేశారు. విద్యార్థులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియలపై అవగాహన కల్పించే లక్ష్యంతో మాక్ అసెంబ్లీ నిర్వహించాలన్న తన ఆలోచనని మంత్రి లోకేష్ ఇటీవల అసెంబ్లీలో ప్రతిపాదించగా సభ్యులంతా మద్దతు తెలిపారు. దాంతో వివిధ స్థాయిలలో విద్యార్థులకు పలురకాల పోటీలు పెట్టి నియోజకవర్గ స్థాయిలో ఒక్కొక్కరిని ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల మాక్ అసెంబ్లీలో వాడి వేడిగా చర్చ జరిగింది. ఒలింపిక్స్ చర్చపై అధికార మరియు ప్రతిపక్ష వర్గాల మధ్య డిబేట్ జరిగింది. ఒక దశలో ప్రతిపక్ష నేతలు స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. కొందరిని మార్షల్స్ ఎత్తుకొని బయట వేశారు. అసెంబ్లీని పోలినట్టు వేసిన సెట్ లో ఈ కార్యక్రమం అంతా జరిగింది. కొంతమంది ప్రజా ప్రతినిధులు గౌరవ సభల్లో ప్రవర్తిస్తున్న తీరును కళ్లకు కట్టినట్టు చూపించిన చిన్నారులు... ఇది చూసి అయినా వాళ్ళు కళ్ళు తెరిచి సభా మర్యాదలు పాటిస్తారేమో చూడాలి!

# జెఆర్ఎం రిసార్ట్స్ ప్రారంభోత్సవంలో మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి.



ఇబ్రహీంపట్నం :-
ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రం సమీపంలోని ఇండస్ట్రియల్ పార్క్ (100 ఫీట్ రోడ్‌లో) నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు జర్కొని రాజు నూతన రిసార్ట్ "జే ఆర్ ఎం రిసార్ట్స్"ను బుధవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) ముఖ్య అతిథిగా హాజరై రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

రాజోలు, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాంద్ర, నవంబర్ 26 : కొబ్బరి లేనిదే భారతీయ సంస్కృతి లేదు. మన సంస్కృతి, సంప్రదాయంలో భాగమైన కొబ్బరిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. కొబ్బరి చెట్టుని నమ్ముకున్న వాళ్లు రోడ్డున పడకూడదు. కొబ్బరి రైతు రోడ్డు ఎక్కకూడదు. కోనసీమ కొబ్బరి రైతాంగం సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కోనసీమ కొబ్బరి రైతులకు భరోసా ఇచ్చారు. 45 రోజుల్లో కొబ్బరి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని, సంక్రాంతి తర్వాత యాక్షన్ ప్లాన్ తో మీ ముందుకు వస్తానని తెలిపారు. కోనసీమ కొబ్బరి రైతుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం పరిధిలోని కేశవదాసుపాలెం వద్ద శంకరగుప్తం, కేశనపల్లి డ్రెయిన్ నుంచి సముద్రపు నీరు పోటెత్తడం కారణంగా పాడైన కొబ్బరి పంటను పరిశీలించారు. మోడుబారిన కొబ్బరి చెట్ల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తలలు వాల్చేసిన కొబ్బరి చెట్లను పరిశీలించారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్య ఎన్నేళ్లుగా ఉంది? సమస్య ఎప్పటి నుంచి తీవ్రమైంది? శంకరగుప్తం డ్రెయిన్ ఎక్కడి నుంచి ఎక్కడి వరకు విస్తరించి ఉంది? డ్రెయిన్ ఏమైనా ఆక్రమణలకు గురైందా అన్న వివరాలపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ , ఉద్యాన శాఖ అధికారులను ఆరా తీశారు. కొబ్బరి తోటలకు తిరిగి పునరుజ్జీవం పోసే అంశంపై శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం పంటలు నష్టపోయిన 13 గ్రామాల ప్రజలతో ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో గతంలో పర్యటించిన సందర్భంలో శంకరగుప్తం డ్రెయిన్ సమస్య ఇంత తీవ్రంగా లేదు. సమస్య నా దృష్టికి వచ్చిన తర్వాత సమగ్ర అధ్యయనం జరిపి శాశ్వత పరిష్కార మార్గాలు అన్వేషించాలని భావించా. మోడు బారుతున్న కొబ్బరి చెట్లకు పునరుజ్జీవం పోయగలమా లేదా? కొత్తగా చెట్లు నాటితే ఎన్నేళ్లకు పంటకు వస్తాయి? ఈ లోపు రైతులకు ఉపాధిపరంగా ఏం చేయగలం? తదితర అంశాలపై సమగ్ర ప్రణాళిక అవసరం. సమస్యపై మూలాల నుంచి అవగాహన తెచ్చుకుంటే తప్ప శాశ్వత పరిష్కారం వెతకలేం.

**- ఇది గత ప్రభుత్వం సృష్టించిన విధ్వంసం**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో డ్రెయిన్లు, పంట కాలువల ఆధునీకరణకు రూ. 4 వేల కోట్లు అవసరం అని అధికారులు తెలియజేశారు. శంకరగుప్తం డ్రెయిన్ కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టేందుకు రూ. 20.62 కోట్లు అవసరం ఉంది. 50 మీటర్లు ఉన్న డ్రెయిన్ గత ప్రభుత్వ హయాంలో కొన్ని ప్రాంతాల్లో మూడు మీటర్లకు కుచించుకుపోయింది. కొన్ని చోట్ల డ్రెయిన్ ఆక్రమణలకు గురయ్యింది. కొన్ని చోట్ల అక్రమంగా ప్రవాహానికి అడ్డుకట్టలు వేశారు. దీనివల్ల సముద్ర%శీ% పోటెత్తినప్పుడు నీరు పంట పొలాల్లోకి చొచ్చుకు వచ్చింది. జీవవైవిధ్యాన్ని దెబ్బ తీసింది. దీనివల్ల కోనసీమ కొబ్బరి తోటలకు మాత్రమే కాదు తీర ప్రాంతానికి కూడా ముప్పు పొంచి ఉందని నీటిపారుదల విభాగం నిపుణులు బి.సి.రోశయ్య నివేదిక చెబుతోంది. ఇది మనిషి సృష్టించిన విధ్వంసం.

**- గత ఐదేళ్లలో కనీసం పూడిక తీయలేదు**

గత పాలకులు గడచిన అయిదేళ్ల కాలంలో శంకరగుప్తం డ్రెయిన్ లో కనీసం పూడిక తీయలేదు. ఒక్క ఇంచి కూడా మట్టి తీయలేదు. ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి అవసరం. గత ప్రభుత్వం కనీసం రోడ్డు మీద గుంతలు కూడా పూడ్చలేదు. డబ్బు ఎడాపెడా ఖర్చు చేసేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ముంచేసింది. ఎక్కడా ఒక విధానం పాటించలేదు. ఇటీవల సచివాలయం ఉద్యోగుల ప్రమోషన్ల అంశంపై చర్చిస్తే ఆ ఉద్యోగుల విషయంలో గత ప్రభుత్వం కనీసం సర్వీస్ రూల్స్ పాటించలేదన్న విషయం బయటపడింది. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. రోడ్లు వేయాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. విపత్తులు సంభవించినప్పుడు పరిహారం ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికీ ప్రాధాన్యత ఇస్తుంది. గత ప్రభుత్వం కనీసం ఉద్యోగులకి సమయానికి జీతాలు ఇవ్వలేదు. గత ప్రభుత్వ తాలూకు లోటుని పూడ్చే ప్రయత్నం చేస్తున్నాం. మేము బాధ్యతగా ఉన్నాం.

**- పచ్చని కోనసీమకు దిష్టి తగిలింది**

పచ్చని కోనసీమకు దిష్టి తగిలింది. ఇక్కడ పచ్చని కొబ్బరి చెట్లను చూసే ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ వచ్చిందేమో? మోడువారిన కొబ్బరి చెట్లను చూస్తుంటే ఎదిగిన కొడుకు మొండెంతో నిలబడినట్టు ఉంటుంది. ఎదిగిన కొడుకు ఎంత సంపాదిస్తాడో తెలియదు. ఎదిగిన కొబ్బరి చెట్టు మాత్రం ఆదాయం ఇస్తుంది. ఎకరం భూమిలో కొబ్బరి తోట ఉంటే రూ.2 లక్షల ఆదాయం వస్తుంది. కొబ్బరి రైతుకు ఆ ఆదాయం శాశ్వతం కావాలి. 14 ఏళ్లుగా శంకరగుప్తం డ్రెయిన్ సమస్య ఉంది. 14 రోజుల్లో పరిష్కార మార్గాలు అన్వేషిస్తాం. చికిత్స కంటే నివారణ మేలు అన్న పెద్దల మాటను ఆచరణలో పెట్టేవాడిని. శంకరగుప్తం డ్రెయిన్ సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపుతాం.

**- బి.సి.రోశయ్య రిపోర్టుపై అధ్యయనం**

కోనసీమ ప్రాంతంలో డ్రెయిన్లపై నీటిపారుదలశాఖ నిపుణులు బి.సి.రోశయ్య రాసిన రిపోర్టును అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తాం. రెండు వారాల్లో అధికారులు ఈ రిపోర్టుపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలి. డిసెంబర్ 2వ వారంలో ఈ సమస్యపై అధికారులు, రైతులతో మరో సమావేశం నిర్వహిస్తాం. శంకరగుప్తం డ్రెయిన్ బాధిత కొబ్బరి రైతుల సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన తక్షణ





ఉపసమనచర్యలపై చర్చిస్తాం. ఒక నివేదిక సిద్ధం చేసి మంత్రివర్గం ముందుంచుతాం. సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తాం.

**- కొబ్బరి రైతుల సమస్యలపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ**

మీ శ్రేయస్సు కోరుకునే వ్యక్తి ఉప ముఖ్యమంత్రిగా ఉన్నాడు. మాటలు చెప్పి మభ్యపెట్టేందుకు రాలేదు. కొబ్బరి రైతుకు అండగా ఉండేందుకే ఇక్కడికి వచ్చాను. 45 రోజుల్లో కోనసీమ కొబ్బరి రైతుల సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తాం. సంక్రాంతి తర్వాత యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం. ఈలోపు అధికారులు, కొబ్బరి రైతులతో మరో రెండు సమావేశాలు నిర్వహిస్తాం. 14 రోజుల తర్వాత తదుపరి సమావేశం నిర్వహిస్తాం. డ్రెయిన్ లో ఆక్రమణలు ఎంత ఉన్నాయి? గట్టు ఎంత మేర దెబ్బ తింది? ఏ మేరకు పూడిక ఉంది? అనే అంశాలతో పాటు శ్రీ బి.సి. రోశయ్య గారి రిపోర్టుపై కూడా అధ్యయనం చేసి నివేదిక రూపొందించండి. ముఖ్యమంత్రి కార్యాలయానికి సమస్య తీవ్రత తెలియజేసి పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు ప్రత్యేక కమిటీ వేద్దాం. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేద్దాం.

**- కేంద్రం దృష్టికి కొబ్బరి రైతుల సమస్యలు**

కోనసీమ ప్రాంతంలో లక్ష ఎకరాల్లో కొబ్బరి సాగు అవుతోంది. ఇక్కడ కోకోనట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం మాత్రమే ఉంది. కోనసీమలో కోకోనట్ బోర్డు ఏర్పాటు చేసే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తాం. ఓఎన్జీసీ కార్యకలాపాలు కూడా సమస్యకు కారణం అన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయి. స్థానిక పార్లమెంటు సభ్యులతో సహా మనకు 21 మంది ఎంపీలు ఉన్నారు. వారితో కలసి కోనసీమ కొబ్బరి రైతుల సమస్యను కేంద్రం ముందు ఉంచుతాం. సమస్య మూలాలు వెతికి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాము.

**- రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ భరోసా ఇస్తుంది**

ప్రతి ఒక్కరికీ రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ భరోసా ఇస్తుంది. ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు బలంగా ఉండాలి అన్నది కూడా రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం



పార్లమెంటు సభ్యుడు జి.వి.హరీష్, రాజోలు శాసన సభ్యుడు దేవా వరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్,ఎస్పీ రాహుల్ మీనా, వ్యవసాయ రంగ నిపుణులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**- దారి పొడవునా జన నీరాజనం**

అంతకు ముందు శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై అధ్యయనం చేసేందుకు రాజోలు నియోజకవర్గానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్ కి కోనసీమ ప్రజలు జయజయధ్వానాలతో స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి కేశనపల్లి వరకు, కేశనపల్లి నుంచి శివకోడు సభ వరకు గ్రామ గ్రామాన ప్రజలు పూల జల్లులు, హారతులతో నీరాజనం పలికారు. సమస్యలు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లేందుకు వినతిపత్రాలు, ప్లకార్డులతో క్యూ కట్టారు. పర్యటన ఆద్యంతం వాహనం నుంచి ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ.. వినతిపత్రాలు తీసుకుంటూ పవన్ కళ్యాణ్ ముందుకు సాగారు



# మహానగరంతోపాటు మహేశ్వరం అభివృద్ధి కిచ్చన్న గారి లక్ష్మా రెడ్డి

మహేశ్వరం
పురపాలికల విలీనంతో సమగ్ర అభివృద్ధి పట్టణ ప్రణాళికత్వరలో డివిజన్ల పునర్విభజన, సర్కిల్, జోనల్ ఆఫీసుల ఏర్పాటు కందుకూర్, మహేశ్వరం మండలాలకు ఫ్యూచర్ సిటీ మణిహారంనవంబర్ 26, 2008 ముంబై దాడుల మృతులకు నివాళిగ్రేటర్ హైదరాబాద్ లో మహేశ్వరం నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలు, రెండు కార్పొరేషన్లు విలీనం చేయటం హర్షనీయమని కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, అన్నారు.అంతర్జాతీయ ప్రమాణాలతో మెట్రో నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ లో శివారు గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కలపటం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని కేఎల్ఆర్ చెప్పారు.గతంలోనే చెప్పిన కె ఎల్ ఆర్, తుక్కుగూడ, జల్ పల్లి మున్సిపాలిటీలు, బడంగ్ పేట, మీర్పేట్ కార్పొరేషన్లను గ్రేటర్ లో విలీనం చేయనున్నట్లు కాంగ్రెస్ శ్రేణులకు కొద్ది నెలల క్రితమే సంకేతం ఇచ్చారు. ఇప్పుడు అదే నిజం అయింది. ఓ ఆర్ ఆర్ లోపల ఉన్న 27 పురపాలికలను జిహెచ్ఎంసి లో అంతర్భాగం చేయటం వల్ల పట్టణ ప్రణాళిక ద్వారా అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందుతాయని లక్ష్మారెడ్డి, తెలిపారు.
కందుకూరు, మహేశ్వరం మండలాలకు ఫ్యూచర్ సిటీ మణిహారంగా నిలవనుందని ఆనందం వ్యక్తం చేశారు.గ్రేటర్ హైదరాబాద్ శివారు మున్సిపాలిటీల విలీనంతో మినీ తెలంగాణగా మారనుంది. త్వరలోనే డివిజన్ల పునర్విభజన జరిగితే జనాభా ప్రతిపాదికన, దామాషా ప్రకారం రిజర్వేషన్లు, సీట్ల కేటాయింపు ఉంటుందని కిచ్చెన్న ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోనే అతిపెద్ద మహానగరంగా గ్రేటర్ హైదరాబాద్ కీర్తికెక్కనుంది. విస్తరణతో దాదాపు 2 కోట్ల జనాభాకు పాలన సౌలభ్యం, నగరవాసులకు మెరుగైన మౌలిక వసతుల కల్పన జరుగుతుందని కెఎల్ఆర్,అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో విలీన పురపాలకలు శరవేగంగా అభివృద్ధి దిశలో పయనిస్తాయని తెలిపారు.2008 నవంబర్ 26 ముంబై దాడుల్లో 166 మంది అసువులుబాయగా... అనేక మంది గాయపడ్డారు. మృతి చెందిన వారికి నివాళి అర్పించారు, నాటి మారణహెూమానికి సరిగ్గా నేటికి 17ఏళ్లు పూర్తయింది. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి,

# ఆదిభట్ల మున్సిపాలిటీని జిహెచ్ఎంసిలో కలపొద్దు.

## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం.



ఇబ్రహీంపట్నం :-
రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీని ప్రభుత్వం జిహెచ్ఎంసి లో విలీనం చేయొద్దని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిభట్ల గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీలో విలీనం చేసినందుకే ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తీరా ఇప్పుడు మున్సిపాలిటీ నుండి జిహెచ్ఎంసిలో విలీనం చేస్తామని ప్రకటించడం చాలా విడ్డూరంగా ఉందని ఇక్కడి ప్రజలమైన మా అభిప్రాయం తీసుకోకుండా ఇష్టం వచ్చినట్లు ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. ఆదిభట్ల ను మినహాయించి మిగతా మున్సిపాలిటీలను జిహెచ్ఎంసి లో విలీనం చేసుకోండి ఆదిభట్ల ను మాత్రం మినహాయించవలసిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పత్రిక ముఖంగా కోరారు.

# పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడి వేడి పాలు, గుడ్లు, బన్స్, బిస్కెట్స్, మంచి నీరు, పంపిణీ కార్యక్రమం



విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 26 :
విజయవాడ నగర పరిసర ప్రాంతాలైనా సీతానగరం, దుర్గాగుడి, కుమ్మరిపాలెం సెంటర్, చిట్టినగర్ మరియు అనేక ప్రాంతాల్లో వందలాది బిక్షగాళ్ళకు వేడి వేడి పాలు, గుడ్లు, బన్స్, బిస్కెట్స్, మంచి నీరు, కందుల పరమేశ్వర రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వసుధ రుతికా, మెట్టపల్లి అయ్యప్ప, పరమేశ్వర మోటర్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (పి.ఎం.టి.డబ్ల్యూ.యు) నాయకులు వసుధ దుర్గారావు తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిక్షగాళ్లు మాట్లాడుతూ ఈ ట్రస్టు వారు మమ్మల్ని గుర్తించి మేము ఎక్కడ ఉన్నా తమ దగ్గరకు వచ్చి ఏదో ఒక సాయం, ఏదో ఒక రూపంలో చేయటం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. మేట్టపల్లి తులసీ మాట్లాడుతూ కందుల పరమేశ్వర రావుతో కలిసి తాము ప్రతి సంవత్సరం శీతాకాలం నాలుగు నెలలు వారానికి ఒకటి లేక రెండుసార్లు తప్పకుండా బిక్షగాళ్లకు టి లేక కఫీ మరియు బిస్కెట్ లేక బన్స్ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాను భాగస్వామ్యం అయి ఉండటం తాను ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నాను అని అన్నారు. దేగల రామారావు, కందుల పరమేశ్వర రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహాయ సహకారం అందించిన కందుల నాగేశ్వరమ్మా, సీరా రమేష్ కుమార్, చిర్ర రామకృష్ణ, కుక్కమళ్ళ ప్రసంగి, కోన రమేష్, కడియం సూరిబాబు, కిలారి ఉమ మహేశ్వర రావు వీళ్ళకి ధన్యవాదాలు తెలియజేశారు. ట్రస్ట్ సభ్యులైన మర్తాడు శిరీష, ముంగి పూర్ణిమ, వేమూరి నాగేంద్ర మాట్లాడుతూ పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏ కార్యక్రమం చేసిన తమందరి పరిపూర్ణమైన సహాయ సహకారాలు అందిస్తామని, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుల పరమేశ్వర రావు అడిగిన వెంటనే చేస్తామని తెలియజేశారు.

# గ్రామపంచాయతీ బరిలో తగ్గేదేలే అంటున్న తెలుగు తమ్ముళ్లు

ఎర్రుపాలెం:
స్థానిక సంస్థ ఎన్నికల్లోని గ్రామపంచాయతీ పోటీలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీ స్థానాల నుంచి పోటీ చేసేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం మండలం అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వర రెడ్డి బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పేర్కొన్నారు. స్థానిక మండల కేంద్రమైన ఎర్రుపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎలక్షన్ల ప్రక్రియలో భాగంగా తెలుగుదేశం పార్టీ కీలక నిర్ణయాలు వెలువరించింది. దానిలో భాగంగా పార్టీ కార్యకర్తలు ఆయా గ్రామాల పార్టీ సీనియర్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాలతో చర్చించి అందరి మనోభావాల మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ సర్పంచి, వార్డు మెంబర్లుతో సహా నామినేషన్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ప్రకటించారు. పోటీకి తగ్గేది లేదంటున్న తెలుగు తమ్ముళ్ల ఉత్సాహాన్ని ఆపడం ఎవరి తరం కాదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గురజాల సత్యనారాయణ, దేవరకొండ మోహన్ రావు,జవాజి భాస్కరరావు,వాసిరెడ్డి శివకుమారి, శీలం నాగిరెడ్డి, కొర్లపాటి శ్రీనివాసరావు, బొగ్గుల సత్యనారాయణ రెడ్డి, వేముల వెంకటేశ్వరరావు, రాజా,గంగవరపు కృష్ణారావు, మారాబత్తుల వెంకన్న, ఎస్కే లాల్,రమేష్,భాస్కర్ రెడ్డి, చాట్ల బాబురావు, వరి కూటి రవికుమార్, తెలుగుదేశం తమ్ముళ్లు, నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు

# వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థిలు



చిగురుమామిడి హుస్నాబాద్ లో
తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు భారత రాజ్యాంగం విశిష్టతలు హక్కులు, బాధ్యతలు ఎదుర్కొంటున్న సవాళ్లు అను అంశంపై జిల్లాస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చిగురుమామిడి మండలం లోని ముల్కనూర్ మోడల్ స్కూల్ కు చెందిన డి.అక్షయ సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్బంగా నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వాగేషన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు.జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని పొందిన విద్యార్థిని డి అక్షయ, పి రాములు పిజిటి సివిక్స్ లను పాఠశాల ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ అభినందించారు.



# గోవిందపురంలో నూతన సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**- ప్రజలందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి,నవంబర్ 26 : జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 43.6 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. గోవిందపురం గ్రామ సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా పరిపాలనా సౌలభ్యం మరింత సులభవంతం అయిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వివిధ ధృవపత్రాలు పొందడంతో పాటు వివిధ ప్రభుత్వ పనులు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. సామాన్యులకు రాజ్యాధికారం అందించిన రోజు ఈరోజు రాజ్యాంగ దినోత్సవం అని ప్రజలందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. గోవిందపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆయుర్వేదం వైద్యులు రవి వర్మతో గ్రామ అభివృద్ధి పై కొద్దిసేపు ముచ్చటించారు అనంతరం ఎమ్మెల్యేని, రవి వర్మ ని వివిధ పదవులు పొందిన నాయకులను గ్రామస్తులు శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, అడబాల భాస్కరరావు, పైడిపాల సూరిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వెలిశెట్టి శ్రీను, ఎంపీటీసీ జానకి వరలక్ష్మి, నాని రాజు, కమ్మిల దుర్గాప్రసాద్, కొల్లు రామకృష్ణ, హనుమంతు పద్మనాభం, గ్రామ టిడిపి అధ్యక్షుడు రామిశెట్టి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం కాలువ గట్టుపై వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ ఆవిష్కరణ పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**- భారీ అన్న సమారాధన వేలాదిగా భక్తులు హాజరు**



గండేపల్లి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 26 :
గండేపల్లి మండలం తాళ్లూరు నుండి ఉప్పలపాడు వెళ్లే మార్గంలో పోలవరం కాలవ గట్టు పక్కన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి 18 అడుగుల విగ్రహ ఆవిష్కరణ, శిలా మూర్తి ప్రతిష్ట మహెూత్సవం సీతానగరం మండలం చిన్న కొండే పూడి గ్రామకాపరస్తులు యనమదల నాగేశ్వరరావు పద్మ దంపతులచే విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ, భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కారనిర్వాక అధ్యక్షులు, సత్య సనాతన గోసంరక్షణ పరిషత్ అధ్యక్షులు, టిడిపి యువ నాయకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి హాజరయ్యారు. ముందుగా విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదా స్వీకరించారు. వేలాదిగా భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించి ఆ స్వామివారిఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, పాలచర్ల మంగారావు, కందుల వీరబాబు, అడబాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 26 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు వివాహాది శుభాకార్యాలకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ గారు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ శ్రీ చిత్తరమ్మ గుడి దర్శనం అనంతరం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# "నీ ఓమ్" ఇంటీరియర్, ఆర్కిటేక్చర్ డిజైన్ స్టూడియో ప్రారంభం





నిజామాబాద్ సిటీ :
నిజామాబాద్ నగరంలోని ఆర్మూర్ రోడ్డులో "నీ ఓమ్" ఆ కంపెనీ ఎండి నికిత్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. నిర్మాణాలకు ఇంటి లోపల ఇంటీరియర్, ఆర్కిటెక్చర్, ప్లానింగ్ ను హైదరాబాద్ లాంటి మహానగరాల్లో తో పోల్చే విధంగా నిజామాబాద్ జిల్లా వాసుల కోసం జిల్లా కేంద్రంలో ఈ తమ కంపెనీని ప్రారంభించడం జరిగిందని కంపెనీ ఎండి నికిత్ పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంటి లోపల, ప్రజలకు నచ్చే నచ్చే ప్రజలకు నచ్చే మెచ్చే విధంగా ఇంటీరియర్ డెకరేటర్ ను సదుపాయాలను ప్రజల ముందు ఉంచుతున్నామని ఆయన అన్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో విజయవంతం గా కొనసాగుతుందని, ఇప్పుడు నిజామాబాద్ ప్రజలకోసం రెండో బ్రాంచ్ ను ప్రారంభించామని ప్రజలు ఒక్కసారి తమ బ్రాంచ్ కు వచ్చి సందర్శించి కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారి కోసం తమ ఇంట్లో ఇంటీరియల్, ఆర్కిటెక్చర్ ప్లానింగ్ చేసుకునే వారి కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రం లో తమ షోరూం కు వచ్చి మీకు నచ్చే డిజైన్లను ఎంపిక చేసుకోవచ్చని ఆయన అన్నారు

# న్యాయం కావాలి



తెలుగులో వచ్చిన సెన్సేషనల్ హిట్ సినిమా న్యాయం కావాలి 1983లో కేరళిద హెన్ను పేరుతో కన్నడలో నిర్మించారు. అందులో చిరంజీవి పాత్రను శంకర్ నాగ్ రాధిక పాత్రను విజయశాంతి శారదా పాత్రను జయంతి పోషించారు..కన్నడలో ఒకటో రెండో సినిమాలు చేసిన విజయశాంతి కి ఈ సినిమా హిట్ అయిన తిరిగి కన్నడలో చేసే అవకాశం వచ్చిన చెయ్యడానికి డేట్స్ లేక చెయ్యలేదు. ఈ సినిమా చూసే కృష్ణ ఈమెకు నేటి భారతంలో అవకాశం ఇచ్చాడు... అపుడే శ్రీరంగ నీతులు సినిమా హిట్ అవడం పండంటి కాపురానికి పన్నెండు సూత్రాలు హిట్ అవడంతో అవకాశాలు వెల్లువెత్తి ఇతర భాషల్లో చేసే అవకాశం వచ్చిన తెలుగులోనే డేట్స్ ఇవ్వడం కన్నడ కన్నా తెలుగులోనే ఆదాయం ఉండటం తో ఆమె ఇక్కడే స్థిరపడి పోయింది. ఆమె నటన సైడ్ పాపటి తీసి వాలుజడతో అటు పల్లెటూరి అమ్మాయిల ఇటు మోడర్న్ అమ్మాయిల నటించి మెప్పించింది. శంకర్ నాగ్ తన అందంతో హుషారు నటనతో ఇక్కడ చిరంజీవి ఎలానో కన్నడలో అతను మంచి పేరు తెచ్చుకుని 1990లో కారు ఆక్సిడెంట్ లో అతి చిన్న వయసులో మృతి చెందాడు.

– ఎం.నాగేంద్ర ప్రసాద్

# బాలకృష్ణ సినిమా వేడుకకు చీఫ్ గెస్ట్ గా సీఎం రేవంత్ రెడ్డి

**- 'అఖండ 2' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్**

**- ఈ నెల 28న ఘనంగా జరగనున్న వేడుక- షూటింగ్ బిజీ వల్ల రాలేకపోతున్న అల్లు అర్జున్**

**- డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల**

**- డిసెంబర్ 4న ప్రీమియర్ షోలకు ప్లాన్ చేస్తున్న నిర్మాతలు**





హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 26 :
నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది. ఈ వేడుకను చాలా గ్రాండ్‌గా నిర్వహించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను కూడా మరో అతిథిగా ఆహ్వానించినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఈవెంట్‌కు రాలేకపోతున్నారని తెలిసింది. సినిమా విడుదలయ్యాక జరిగే సక్సెస్ మీట్‌లో బన్నీ పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, 'జాజికాయ జాజికాయ' పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు డిసెంబర్ 4వ తేదీ రాత్రి నుంచే పెయిడ్ ప్రీమియర్ షోలు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం చిత్ర బృందం ఎదురుచూస్తోంది.




# డి.యస్.రావు తనయుడు హీరోగా

# పదహారు రోజుల పండుగ



























హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 26 : నిర్మాత, నటుడు దమ్మాలపాటి శ్రీనివాసరావు తనయుడు సాయికృష్ణ హీరోగా పరిచయం అవుతున్నాడు. సాయికృష్ణతో 'పదహారు రోజుల పండుగ' పేరుతో సాయికిరణ్ అడవి ఓ సినిమాను రూపొందిస్తున్నాడు. వినాయకుడు, విలేజ్ లో వినాయకుడు, కేరింత' వంటి విజయవంతమైన చిత్రాలను రూపొందించిన సాయికిరణ్ అడివి తాజా చిత్రం 'పదహారు రోజుల పండుగ'. ఈ సినిమాతో నిర్మాత, నటుడు డి.ఎస్.రావు తనయుడు సాయికృష్ణ దమ్మాలపాటి హీరోగా పరిచయం అవుతున్నాడు. గోపికా ఉదయన్ హీరోయిన్. ఈ చిత్రంలో రేణు దేశాయ్, అనసూయ భరద్వాజ్, 'వెన్నెల' కిశోర్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను సురేశ్ కుమార్ దేవత, హరిత దుద్దుకూరు, ప్రతిభ అడివి నిర్మిస్తున్నారు. బుధవారం జరిగిన పూజా కార్యక్రమాలకు హాజరైన కోన వెంకట్, కె. కె. రాధామోహన్ నిర్మాతలకు స్క్రిప్ట్ ఇచ్చారు. డైరెక్టర్ శేఖర్ కమ్ముల క్లాప్ కొట్టారు. నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి సురేశ్ బాబు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాతలు అల్లు అరవింద్, మైత్రి మూవీ మేకర్స్ రవిశంకర్, దామోదర ప్రసాద్ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభోత్సవం తర్వాత సాయికిరణ్ అడివి మాట్లాడుతూ ఈ సినిమాకు 'పదహారు రోజుల పండుగ' అనే టైటిల్ ను కృష్ణవంశీ సజెస్ట్ చేశారు. ఈ కథ ఆయనకు బాగా నచ్చడంతో దీనిని సూచించారు అని అన్నారు. సాయికిరణ్ అడివి ఈ కథను లాక్ డౌన్ కు ముందే తనకు చెప్పారని, ఇందులో అత్తమ్మ పాత్రను చేస్తున్నానని రేణు దేశాయ్ చెప్పారు. సాయికిరణ్ అడివి దర్శకత్వంలో తాను హీరోగా తొలి చిత్రం చేయడం ఆనందంగా ఉందని హీరో సాయికృష్ణ తెలిపాడు. ఈ ప్రాజెక్ట్ లో భాగం కావడం పట్ల హీరోయిన్ గోపికా ఉదయన్ హర్షం వ్యక్తం చేసింది. అనసూయ భరద్వాజ్, రామ్, లక్ష్మణ్, జానీ మాస్టర్ ఈ సినిమాలో వర్క్ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. తమ 'పదహారు రోజుల పండుగ' సినిమా వందరోజులు ఆడాలని నిర్మాత సురేశ్ కుమార్ ఆకాంక్షించారు. ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు




Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com